సాక్షి
సూర్యాపేట
బుధవారం । 6 । డిసెంబర్ । 2023



కాల్వలకు గండ్లు..
ఆత్మకూర్ మండలంలో ఎస్సారెస్పీ కాల్వలతో పాటు వాటి ఉప కాల్వలు నిర్వహణలేక దెబ్బతిన్నాయి.
- 8లో



ఇల్లాలే సూత్రధారి..!
చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఈ నెల 3వ తేదీన వెలుగుచూసిన అనుమానాస్పద కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు.
- 10లో



మట్టపల్లిలో నిత్యారాధనలు
మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీనృసింహ స్వామి నిత్యారాధనలు మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు.
- 10లో

న్యూస్‌రీల్

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

సూర్యాపేట క్రైం: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు, రైతులు, వాహనదారులు, ప్రయాణికులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఓ ప్రకటనలో కోరారు. జిల్లాలో పోలీస్ అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేశామని తెలిపారు. అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించి సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఏదైనా అత్యవసరమైతే స్థానిక పోలీసులకు, డయల్ 100కు ఫోన్ చేసి సేవలను పొందవచ్చని సూచించారు.

ఎస్పీ సూచనలు

శిథిలావస్థకు చేరిన నివాసాల్లో ఉండవద్దని ఎస్పీ సూచించారు. చెరువులు, వాగులు నిండుగా ఉన్నాయి కాబట్టి వాటి వద్దకు వెళ్లొద్దని పేర్కొన్నారు. చేపల వేటకు కూడా వెళ్లవద్ద ని కోరారు. వాతావరణ తడిగా ఉన్నందున కరెంట్ స్తంభాల వద్దకు వెళ్లొద్దని, సాధారణ ప్రజలు కరెంట్ రిపేర్ పనులు చేయవద్దని సూచించారు. వర్షం ప్రభావంతో చలి తీవ్రత ఉన్నందున పిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రయాణ సమయంలో వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ఉండాలని రోడ్లపై వర్షపు నీళ్ల చేరడం వల్ల వాహనాలు అదుపు తప్పి రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. వాహనాలు వేగంగా నడపవద్దని, వర్షం పడే సమయంలో ప్రయాణాలు చేయకుండా వీలైతే వాయిదా వేసుకోవాలని కోరారు.

ముగిసిన ఎన్నికల కోడ్

దురాజ్‌పల్లి(సూర్యాపేట) : అసెంబ్లీ సాధారణ ఎన్నికల సందర్భంగా విధించిన కోడ్ ముగిసింది. కేంద్ర ఎన్నికల సంఘం అక్టోబర్ 9వ తేదీన ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఆ రోజు నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని ప్రకటించింది. నవంబరు 3వ తేదీన తెలంగాణ ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. అదే రోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. నవంబరు 30వ తేదీన పోలింగ్ ముగిసింది. డిసెంబరు 3న కౌంటింగ్ జరిగింది. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఎన్నికల కోడ్ ముగిసినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ



పాతగుట్టలో ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయస్వామికి మంగళవారం అర్చకులు ఆకుపూజ విశేషంగా నిర్వహించారు. హనుమంతుడికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో ఆకుపూజ జరిపించారు. హనుమంతుడికి ఇష్టమైన నైవేద్యాన్ని సమర్పించి, భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు నిర్వహించారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: భూదాన్‌పోచంపల్లి మండలంలోని జలాల్‌పురంలో ఉన్న స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో 2 నెలల కాలవ్యవధి గల బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్హతతో పాటు అభ్యర్థులు 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 11న సంస్థ నిర్వహించే కౌన్సిలింగ్‌కు తమ విద్యార్హతల సర్టిఫికెట్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో నేరుగా హాజరుకావాలని సూచించారు. ఎంపికై న సుదూర ప్రాంత అభ్యర్థులకు నెలకు రూ.3వేల ఫీజుతో హాస్టల్ వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం అభ్యర్థులకు ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 91339 08000, 91339 08111 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



చర్చి మహోత్సవంలో పాల్గొన్న ఫాదర్లు, క్రైస్తవులు

పునీతశౌరి చర్చి మహోత్సవం

మఠంపల్లి : మఠంపల్లి మండల కేంద్రంలోని శౌరినగర్‌లో గల పునీత శౌరివారి చర్చి మహోత్సవాలను మంగళవారం స్థానిక శుభవార్త చర్చిలో ఘనంగా నిర్వహించారు. ఫాదర్ మార్టిన్ దివ్యబలిపూజ, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. క్రీస్తు బోధనలను పునీత శౌరి లోకం విస్తృత ప్రచారం నిర్వహించారన్నారు. కాగా 64మంది విశ్వాసులకు ఫాదర్ మార్టిన్ దివ్య సంస్కారాలను అందించారు. కార్యక్రమంలో విచారణ గురువులు ఫాదర్ అల్లం బాల, సాగర్, బాలశౌరిరెడ్డి, 12మంది విచారణ గురువులతో పాటు బ్రదర్ వినోద్‌రెడ్డి, సిస్టర్ సుజాత, శౌరివారి చర్చి, శుభవార్త చర్చి కమిటీల పెద్దలు, క్రైస్తవులు పాల్గొన్నారు.

మనోళ్లకు పెద్దపీట

కొత్త కేబినెట్‌లో ఉమ్మడి జిల్లా నేతలకు అగ్రతాంబూలం!

- పార్టీ పదవుల్లోనూ ప్రాధాన్యం
- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మంత్రి పదవితో పాటు పీసీసీ పీఠం?
- ఉత్తమ్‌కుమార్ రెడ్డికి కీలక పదవి
- ఆ దిశగా కసరత్తు చేస్తున్న కాంగ్రెస్ అధిష్టానం



హైదరాబాద్ ఎల్లా హోటల్‌లో సహచర ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులతో చర్చిస్తున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కొత్తగా ఏర్పడనున్న రాష్ట్ర కేబినెట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అధిక ప్రాధాన్యం దక్కనుంది. అత్యధికంగా మంత్రి పదవులతో పాటు పార్టీ పదవుల్లోనూ నల్లగొండకే ప్రాధాన్యం ఇచ్చేలా కాంగ్రెస్ అధినాయకత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో మహబూబ్‌నగర్ తరువాత అత్యధిక స్థానాలను ఇక్కడి నుంచి గెలిచిన నేపథ్యంలో నల్లగొండ జిల్లాకు పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలన్న నిర్ణయానికి వచ్చింది. ముఖ్యంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి కూడా కీలక పదవులు దక్కే అవకాశం ఉంది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా సీఎం పదవి ఆశించారు. అయితే, ఆ పదవిని రేవంత్‌రెడ్డికి ఇవ్వడంతో ఉత్తమ్‌కు మంత్రివర్గంలో కీలక పదవి అప్పగించే అవకాశం ఉంది. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మంత్రి పదవితో పాటు పీసీసీ పీఠం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కాంగ్రెస్‌కు కంచుకోటగా నల్లగొండ

నల్లగొండ జిల్లా కాంగ్రెస్‌కు కంచుకోట. గత 30 ఏళ్లలో అత్యధిక శాతం ప్రజలు కాంగ్రెస్ వైపే నిలిచారు. ప్రస్తుతం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 12 స్థానాలకు గాను 11 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. ఇందులో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి లాంటి సీనియర్ నేతలు ఉన్నారు. మహబూబ్‌నగర్ తరువాత అత్యధిక స్థానాలను గెలిపించి ఇచ్చింది నల్లగొండ జిల్లానే. మహబూబ్‌నగర్ నుంచి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన నేపథ్యంలో మంత్రి పదవుల్లో అగ్ర తాంబూలం నల్లగొండ జిల్లాకే ఇవ్వాలని అధిష్టానం యోచిస్తోంది. మంత్రి పదవులతో పాటు పార్టీ పదవుల్లోనూ సముచిత ప్రాధాన్యం దక్కనుంది.

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మంత్రి పదవి, పీసీసీ పీఠం?

నల్లగొండ నుంచి విజయం సాధించిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలోనే సీనియర్ నాయకుడు. అయిదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా విజయం సాధించడంతో పాటు, టీడీపీ ప్రభుత్వ హయాంలో నల్లగొండ నియోజకవర్గంలో ఫ్లోరైడ్ రహిత తాగునీరు అందించాలని ఆమరణ నిరాహార దీక్ష చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఐటీ శాఖ మంత్రిగా పనిచేశారు. తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో రాష్ట్ర మంత్రిగా ఉన్న ఆయన.. తెలంగాణ సాధన కోసం సొంత ప్రభుత్వం మీదనే పోరాడారు. మంత్రి పదవికి రాజీనామా చేసి నల్లగొండ పట్టణంలో ఆమరణ నిరాహార దీక్ష చేశారు. అంతేకాదు తెలంగాణ కోసం రెండు పర్యాయాలు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసినా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదించలేదు. ఆ తర్వాత ఆయన నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. సోనియా గాంధీ ఆశీర్వదిస్తే ముఖ్యమంత్రి అవుతానని ఆయన గతంలో చెప్పుకొచ్చారు. ప్రస్తుతం మారిన సమీకరణల్లో భాగంగా వెంకట్‌రెడ్డికి మంత్రి పదవితో పాటు పీసీసీ పీఠాన్ని అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రాజగోపాల్‌రెడ్డికి కూడా..

మునుగోడు నుంచి గెలుపొందిన కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో కీలక నేత. ఆయన ఒకసారి ఎంపీగా, ఒకసారి ఎమ్మెల్సీగా, ఇప్పుడు రెండోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఈ నేపథ్యంలో ఆయనకు చీఫ్ విప్ లేదా ప్రభుత్వంలో మరో కీలక పదవి దక్కుతుందనే చర్చ సాగుతోంది.

సీఎం కాకపోయినా కీలక బాధ్యతలే..

ఉమ్మడి జిల్లాలో మరో సీనియర్ నాయకుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా విజయం సాధించడంతో పాటు పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశారు. ఆయన ముఖ్యమంత్రి పదవి కోసం ఢిల్లీకి వెళ్లి అధిష్టానంతో చర్చలు జరిపారు. అధిష్టానం అన్ని విధాల చర్చించి రేవంత్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా ప్రకటించింది. ఈ పరిస్థితుల్లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి రాష్ట్ర మంత్రి వర్గంలో కీలక పదవి ఇవ్వాలన్న ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇద్దరు ఎంపీలు రాజీనామా చేస్తే
ఉప ఎన్నికలు వస్తాయా..!

17వ లోక్‌సభ ఎన్నికలకు మరో ఐదు నెలలే గడువు

సాక్షి, యాదాద్రి : ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపీలు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు 2019 పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన విషయం తెలిసిందే. అయితే, ఇటీవల వీరిద్దరూ అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచి విజయం సాధించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్ నుంచి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. వీరు ఎమ్మెల్యేలుగా కొనసాగాలంటే ఎంపీ పదవులకు రాజీనామా చేయాల్సి ఉంది. అయితే, వీరి రాజీనామాతో రెండు ఎంపీ స్థానాలకు ఉప ఎన్నికలు వస్తాయా అనే చర్చ జరుగుతోంది. రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్ యాక్ట్ 1951, సెక్షన్ 151–ఎ ప్రకారం.. ఖాళీ అయిన పార్లమెంట్ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆరు నెలల్లో ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, 17వ పార్లమెంట్ సాధారణ ఎన్నికలు 2024 మేలో జరుగనున్నాయి. వీరిద్దరు ఇప్పుడు రాజీనామా చేసినా.. పార్లమెంట్ ఎన్నికలకు ఐదు నెలలే గడువు ఉండడంతో ఉప ఎన్నికలు దాదాపు లేనట్లేనని తెలుస్తోంది. ఇద్దరు ఎంపీలు రాజీనామా చేస్తే వచ్చే పార్లమెంట్ ఎన్నికల వరకు ఆ స్థానాలు ఖాళీగానే ఉండనున్నాయి.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

త్రిపురారం: మిచాంగ్ తుపాన్ కారణంగా రానున్న మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారని, రైతులు పంటల సాగులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే కోసిన వరి పంటను ఎత్తైన ప్రదేశాలకు తరలించి కుప్పలుగా వేయాలని సూచించారు. ఎకరం కుప్పకు 40కిలోల దొడ్డు ఉప్పును మొదళ్ల మధ్యలో వేసి టార్పాలిన్‌లను కప్పుకోవాలని అన్నారు. వర్షాలు తగ్గే వరకు ధాన్యాన్ని మార్కెట్ యార్డులకు తరలించడం వాయిదా వేసుకోవాలని సూచించారు. గింజలు మొలకెత్తకుండా ఉండేందుకు 50 గ్రాముల ఉప్పును ఒక లీటరు నీటికి కలిపి తడిచిన కంకులపై పిచికారీ చేసుకోవాలని కోరారు.

డాక్టర్లు అందుబాటులో ఉండాలి

- రైతులకు టార్పాలిన్లు అందజేయాలి
- కలెక్టర్ వెంకట్రావు



వెబెక్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : వర్షాల వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు అందుబాటులో ఉండాలని కలెక్టర్ వెంకట్రావు ఆదేశించారు. మంగళవారం వెబెక్స్ ద్వారా సంబంధిత అధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో దండోరా వేసి ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సూచించారు . జిల్లాలో మిగిలి ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేలా డీఆర్‌డీఏ, సివిల్ సప్లయ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు టార్పాలిన్లు అందజేయాలన్నారు. ఇరిగేషన్ ఇంజనీర్లు వర్షాలను అంచనా వేసి ట్యాంకులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీలు నీటి నిల్వలు లేకుండా చూడాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఎంపీఓలు, పంచాయతీ సెక్రటరీలతో సమావేశం నిర్వహించి తగిన చర్యలు తీసుకునేలా ఏర్పాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య ను ఆదేశించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లవద్దని కోరారు. నర్సరీలు, సంపదవనాలు పరిశీలించాలన్నారు. ప్రజలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

వలిగొండ : వలిగొండ మండలంలోని సుంకిశాలలో ప్రవాస భారతీయుడు పైళ్ల మల్లారెడ్డి , సాధన సహకారంతో నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

అంతటా ముసురు



ఆత్మకూర్(ఎస్)లో ధాన్యం రాశులపై రైతులు కప్పిన పట్టాలు

- తుపాను ప్రభావంతో రోజంతా వర్షం
- 8.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- కొన్నిచోట్ల కొనుగోలు కేంద్రాల్లో నిలిచిన కాంటాలు
- సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు సెలవు

భానుపురి (సూర్యాపేట) : జిల్లాపై మిచాంగ్ తుపాన్ ప్రభావం పడింది. దీంతో సోమవారమే జిల్లా వ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకోగా మంగళవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా ముసురు పడుతోంది. జిల్లాలో సరాసరి 8.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. వర్షానికి తోడుగా బలమైన చలిగాలులు వీచాయి. ఈ క్రమంలో ప్రజలు తమ ఇళ్ల నుంచి బయటికి వచ్చేందుకు ఇబ్బంది పడ్డారు. ప్రధానంగా అత్యవసర సేవలు అందించే వారితో పాటు పలు రంగాల కార్మికులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కూలీలు, వృద్ధులు, చిన్నారులు ఈ తుపాన్ ప్రభావంతో ఇబ్బందులు పడాల్సివచ్చింది. ఎన్నికల నేపథ్యంలో తొమ్మిది రోజులపాటు వ్యవసాయ మార్కెట్ మూతపడగా.. బుధవారం నుంచి విక్రయాలు జరగాల్సి ఉంది. అయితే తుపాన్ ప్రభావంతో సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం కూడా అధికారులు సెలవు ప్రకటించారు.

23 మండలాల్లో..

తుపాన్ ప్రభావంతో బుధవారం జిల్లా వ్యాప్తంగా 8.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జిల్లాలోని 23 మండలాల్లోనూ తుపాన్ ప్రభావం ఉండగా మఠంపల్లిలో 24.4మిల్లీమీటర్లు, పాలకవీడులో 22.8, హుజూర్‌నగర్‌లో 19.3, చిలుకూరులో 16.8, మేళ్లచెర్వులో 14.3, చింతలపాలెంలో 12.7, మునగాలలో 12.5, నడిగూడెంలో 12.0, నేరేడుచర్లలో 9.1, కోదాడలో 8.2, గరిడేపల్లిలో 7.7, పెన్‌పహాడ్‌లో 7.6, అనంతగిరిలో 6.5, మోతెలో 5.5, ఆత్మకూర్ (ఎస్) లో 3.8, సూర్యాపేటలో 2.8, నూతనకల్‌లో 2.5, నాగారంలో 1.4, చివ్వెంలలో 1.2, మద్దిరాలలో 1.1, జాజిరెడ్డిగూడెంలో 1.1, తుంగతుర్తిలో 0.3, తిరుమలగిరిలో 0.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈ వర్షం కారణంగా జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు నిలిచిపోయాయి. రైతులు తమ ధాన్యం రాశులు తడిసిపోకుండా పట్టాలను కప్పి ఉంచారు. మరో రెండు రోజులపాటు జిల్లాకు తుపాన్ హెచ్చరికలు ఉండడంతో ఈ రైతులు ఆందోళన చెందుతున్నారు.

కంట్రోల్ రూమ్ నంబర్ 6281492368

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : తుపాన్ నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, అత్యవసర సమయాల్లో సమాచారం కోసం కంట్రోల్‌రూమ్ నంబర్ 6281492368 కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ ఎస్. వెంకట్రావు సూచించారు. కంట్రోల్ రూమ్‌లో 24గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. తుపాన్ కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాలకు తోడు చలిగాలులు వీస్తున్నందున ప్రజల అత్యవసరమైతేనే బయటికి రావాలన్నారు. మట్టి గోడలు, కరెంటు స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్నందున చెట్ల కింద ఉండకూడదని, రైతులు పొలం పనులకు వెళ్లరాదని సూచించారు.





సూర్యాపేట పట్టణంలో కురుస్తున్న వర్షం

రాజీనామా చేయాలా.. వద్దా..!

వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్ల సందిగ్ధం

సాక్షి, యాదాద్రి : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారు సందిగ్ధంలో పడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో పలువురు నాయకులకు రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు వచ్చాయి. యాదాద్రి అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన వైటీడీఏకు కేసీఆర్ ఛైర్మన్‌గా ఉండగా, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కిషన్‌రావు వైస్ ఛైర్మన్‌గా ఉన్నారు. ఇంకా మార్కెట్ కమిటీల పాలకవర్గాలు, రైతుబంధు, ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్, గొర్రెలు మేకల పెంపకందారులు కార్పొరేషన్, పశుగణాభివృద్ధి కార్పొరేషన్, గ్రంథాలయాల ఛైర్మన్లు, డైరెక్టర్లు ఉన్నారు. ఇప్పటికే జిల్లాకు చెందిన ఇద్దరు కార్పొరేషన్ల ఛైర్మన్లు దూదిమెట్ల బాల్‌రాజ్ యాదవ్, పల్లె రవికుమార్‌లు రాజీనామా చేశారు. ఇంకా వివిధ నామినేషన్ పోస్టులు అనుభవిస్తున్న వారు తమ పదవులకు రాజీనామా చేయాలా.. లేక పూర్తికాలం పదవిలో ఉండాలా.. అనే సందిగ్ధంలో పడ్డారు. నూతన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేసిన తర్వాత నామినేటెడ్ పదవులపై తీసుకునే నిర్ణయం ఏవిధంగా ఉంటుందోనన్న ఆసక్తి ఉంది. కాగా, తమ ప్రభుత్వం వచ్చింది కాబట్టి తమకు నామినేటెడ్ పదవులు వస్తాయని కాంగ్రెస్ క్యాడర్ సంతోషంతో ఎదురు చూస్తోంది.

1,77,567 టన్నుల ధాన్యం కొనుగోలు

- ఇప్పటి వరకు 31,305 మంది రైతుల నుంచి సేకరణ
- ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో కొనసాగుతున్న వానాకాలం ధాన్యం కొనుగోళ్లు
- నెలరోజుల పాటు సాగే అవకాశం
- 21,118 మంది రైతులకు రూ. 257.75 కోట్లు చెల్లింపులు



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు 1,77,567 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మరో నెలరోజుల పాటు ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగే అవకాశం ఉంది. అప్పటిలోగా నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేయాలని భావిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో రైతులు 3,46,739 ఎకరాల్లో వరి సాగు చేయగా 9,61,046 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. రైతులు పండించిన ధాన్యం సేకరణకు జిల్లా అధికారులు పక్కా ప్రణాళిక రూపొందించారు. వ్యవసాయశాఖ, పౌర సరఫరాల శాఖ అధికారులు జిల్లా నుంచి 4,15,559 మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించాలని నిర్ణయించారు.

274 కేంద్రాల ద్వారా..

జిల్లాలో సహకార సంఘాల ద్వారా 98 కేంద్రాలు, ఐకేపీ ద్వారా 193 కేంద్రాలు ఇలా మొత్తం 291 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ 274కేంద్రాలను మాత్రమే ప్రారంభించారు. వీటి ద్వారా ఇప్పటి వరకు 1,77,567 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. మరో నెల రోజుల పాటు ధాన్యం కొనుగోళ్లు సాగే అవకాశం ఉంది.

ఎన్నికలున్నా ఇబ్బందుల్లేకుండా..

జిల్లా అధికారులు పకడ్బందీ వ్యూహం, పక్కా కార్యాచరణతో పనిచేయడంతో ధాన్యం సేకరణ ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా సాగుతోంది. జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట్‌రెడ్డిలు అసెంబ్లీ సాధారణ ఎన్నికలు ఉన్నా ప్రత్యేక చొరవ తీసుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. సివిల్ సప్లయ్, గ్రామీణాభివృద్ధి, సహకార, వ్యవసాయ శాఖలతోపాటు మరో పది శాఖల అధికారులు సమన్వయం చేసుకోవడంతో కొనుగోళ్లు వేగంగా కొనసాగుతున్నాయి. పారదర్శకంగా కొనుగోళ్లు జరుగుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో అన్నీ ముందస్తు ఏర్పాట్లు చేశారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చర్యలు చేపట్టారు.

రైతుల ఖాతాల్లో రూ.257.75 కోట్లు జమ

జిల్లా వ్యాప్తంగా 31,305 మంది రైతుల నుంచి ధాన్యం సేకరించారు. ఇందుకు రైతులకు రూ.391.18 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 21,118 మంది రైతులకు రూ.257.75 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారు. ఇంకా 10,187 మంది రైతులకు రూ.133.42 కోట్లు చెలించాల్సి ఉంది.

క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు

మోత్కూరు : మోత్కూరు పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద నివసిస్తున్న చెరుకు ఉపేంద్ర భవంతి పైనుంచి వెళ్తున్న రెండు సర్వీస్ వైర్లు మంగళవారం ఒకదానికి ఒకటి అంటుకుని షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. సుమారు 3, 4 మీటర్ల మేరకు సర్వీస్ వైర్లు కాలిపోయాయి. గమనించిన స్థానికులు విద్యుత్ సిబ్బందికి ఫోన్ చేయగా విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

సీతారాంపురంలో జీవాల అపహరణ


మేక కళేబరం

నల్లగొండ క్రైం : గుర్తుతెలియని వ్యక్తులు ఆరు జీవాలను అపహరించి మరో దానిని చంపేశారు. ఈ ఘటన నల్ల గొండ మండల పరిధిలోని అన్నెపర్తి ఆవాసం సీతా రాంపురం గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. సీతారాంపురం గ్రామానికి చెందిన కునుకుంట్ల వెంకన్న, లింగయ్య, బుర్ర శ్రీను జీవాలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరు సోమవారం రాత్రి తమ జీవా లను గ్రామంలోని దొడ్లలోకి తోలి ఇళ్లలో నిద్రపోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత దుండగులు వెంకన్న, లింగయ్యకు చెందిన ఐదు గొర్రెలతో పాటు శ్రీనుకు చెందిన ఒక మేకను ఎత్తుకొని పోగా మరో దానిని లాగే క్రమంలో గాయపడి చనిపోవడంతో అక్కడే వదిలేసి పరారయ్యారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. దొంగలను గుర్తించేందుకు గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడి మృతి


విష్ణుమూర్తి (ఫైల్)

మోటకొండూర్: రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్రవాహన దారుడు మృతిచెందాడు. మోటకొండూరు మండల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మోటకొండూరు మండలం కొండాపురానికి చెందిన పంజాల విష్ణుమూర్తి (55) మంగళవారం సాయంత్రం బైక్‌పై గ్రామ రోడ్డుపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆత్మకూర్ (ఎం) నుంచి కాటేపల్లి వైపుగా వస్తున్న టాటా ఏస్ వాహనం మార్గమధ్యలో విష్ణుమూర్తి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో విష్ణుమూర్తి తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే అతడిని అంబులెన్స్‌లో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడికి నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై రాత్రి వరకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కారు, బైక్ ఢీకొని..


రామచంద్రయ్య మృతదేహం

భువనగిరి క్రైం : కారు, బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన భువనగిరి మండల పరిధి లోని ముస్త్యాలపల్లి స్టేజి వద్ద మంగళవారం చోటు చేసుకుంది. మోటకొండూరు మండలం చాడ గ్రామానికి చెందిన పిట్టల రామచంద్రయ్య (42) సుమారు నాలుగేళ్లుగా భువనగిరిలో భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తూ కూలి పనులు చేసుకుంటున్నాడు. ఇటీవల స్వగ్రామంలో నూతన ఇంటి నిర్మాణం చేపట్టారు. మంగళవారం తన ఇంటి పనులు చూసుకొని తిరిగి భువనగిరికి తన బైక్‌పై వస్తుండగా మార్గమధ్యంలో ముస్త్యాలపల్లి స్టేజి వద్ద ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రామచంద్రయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

క్వార్టర్ల కూల్చివేతకు రంగం సిద్ధం

ఏఎమ్మార్పీ క్వార్టర్లను ఖాళీ చేయాలని నోటీసులు జారీ

- శిథిలమై, ప్రమాదకరంగా మారడంతోనే అధికారుల నిర్ణయం
- ఉద్యోగులకు అపార్ట్‌మెంట్‌ల నిర్మాణం.. ప్రతిపాదనలకే పరిమితం


గుర్రంపోడులో శిథిలమైన ఏఎమ్మార్పీ కాలనీ క్వార్టర్లు

గుర్రంపోడు : నిర్వహణ లోపాలతో శిథిలావస్థకు చేరిన ఏఎమ్మార్పీ క్వార్టర్లను కూల్చివేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగానే తక్కువ అద్దెకు పదుల సంఖ్యలో ఉంటున్న ప్రైవేట్ వ్యక్తులతో పాటు మూడు క్వార్టర్లలో ఉంటున్న ఉద్యోగులకు ఆర్‌అండ్‌బీ అధికారులు తాజాగా నోటీసులు జారీ చేశారు. గుర్రంపోడు మండల కేంద్రంలోని 18 ఎకరాల విస్తీర్ణంలో 1985లో అధికారులకు గెస్ట్‌హౌస్‌తో పాటు 105క్వార్టర్లు నిర్మించారు. ఆహ్లాదం పంచే పూలమొక్కలతో పార్క్, విశాలమైన రోడ్లను నిర్మించారు. ప్రాజెక్టు పూర్తి కావడంతో దశల వారీగా ఉద్యోగుల సంఖ్య తగ్గింపుతో క్వార్టర్లు చాలా వరకు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం నిధులు లేక నిర్వహణ లోపాలతో క్వార్టర్లు సగానికిపైగా కూలిపోయి, మిగిలినవి శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. దీంతో వాటిని కూల్చివేయాలని అధికారులు నిర్ణయించారు. డివిజన్ కార్యాలయ పరిధిలో 25మంది ఉద్యోగులు పనిచేస్తున్నా చాలా వరకు శిథిల క్వార్టర్లలో నివసించలేక ఇప్పటికే ఖాళీ చేశారు.

ప్రతిపాదన దశలోనే..

నీటిపారుదల శాఖ గుర్రంపోడు డివిజన్ పరిధిలో యాభై మంది వరకు ఉద్యోగులు, అధికారులు పనిచేస్తున్నారు. ఇటీవల లస్కర్ పోస్టులు 57 మంజూరు కావడంతో వీరి సంఖ్య మరింతగా పెరగనుంది. క్యాంపు క్వార్టర్లు శిథిలం కావడంతో వీరంతా నల్లగొండ, హైదరాబాద్‌లో నివసిస్తూ రోజూ వచ్చిపోతున్నారు. గతంలో ఇక్కడ ఈఈగా పనిచేసిన శ్యామ్ ప్రసాద్‌రెడ్డి క్వార్టర్లను తొలగించి ఉద్యోగులకు అపార్ట్‌మెంట్‌లు కట్టాలని ప్రతిపాదించినా అమలుకు నోచుకోలేదు. నీటి విడుదల సమయంలో అత్యవసరంగా కాల్వలకు గండ్లు పడి ప్రమాదాలు జరిగేలా ఉన్నందున ఉద్యోగులు స్థానికంగా ఉండాలనే నిబంధనతో క్వార్టర్ల నిర్మాణాలు అవసరం ఉందని ప్రతిపాదనలు పంపారు.

ఆక్రమణకు గురవుతున్న ఖాళీ స్థలాలు

ఏఎమ్మార్పీ క్యాంపు కాలనీ చుట్టూ ప్రహరీ, కంచె లేకపోవడంతో ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఈ క్యాంపు కాలనీ స్థలాలను ఆక్రమణకు గురికాకుండా కాపాడుకోవడం అధికారులకు సమస్యగా మారింది. ఇప్పటికే ప్రభుత్వ శాఖల భవన నిర్మాణాలకు స్థలాల కేటాయింపు జరుగుతున్నా.. ప్రైవేట్ అవసరాలకు ఈ ఖాళీ స్థలం కేటాయింపు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలో జిల్లా అధికార యంత్రాంగం పునరావసం కింద ఒకరికి గృహ నిర్మాణ అవసరాలకు జరిగిన ఖాళీ స్థలం కేటాయింపు రాష్ట్ర స్థాయిలో నీటిపారుదల ఉన్నతాధికారులు అనుమతించకపోవడంతో నిలిచిపోయింది.

క్వార్టర్లను కూల్చివేసి ప్రహరీ నిర్మిస్తాం



ఏఎమ్మార్పీ క్యాంపు కాలనీలో నూతన క్వార్టర్ల నిర్మాణానికి గతంలోనే ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతానికి క్యాంపులో ఈఈ కార్యాలయం మినహా అన్ని క్వార్టర్లు కూల్చివేసి చెట్లు నాటడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. 18ఎకరాల క్యాంపు కాలనీ చుట్టూ పటిష్టమైన ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతున్నాం.

– ఆనందరావు, డివిజన్ ఈఈ

శిథిలావస్థలో డివిజన్ కార్యాలయం

ఏఎమ్మార్పీ ఆయకట్టుతోపాటు, కుంటలు, చెరువులను పర్యవేక్షించే ప్రాజెక్టు డివిజన్–5 కార్యాలయం కూడా శిథిలావస్థకు చేరింది. రేకుల షెడ్‌తో నిర్మించిన ఈ కార్యాలయంలో కిటికీలు, తలుపులు ధ్వంసమై పాములు, విష కీటకాలు వస్తుండడంతో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. పక్కనే గల పార్క్ ఆనవాళ్లు లేకుండా ఉండగా మరో గెస్ట్‌హౌస్ భవనం శిథిలమైంది. సబ్ డివిజన్ కార్యాలయం కాలం చెల్లిన క్వార్టర్లలోనే ఉంది.


ఊడిపోయిన డివిజన్ ఈఈ కార్యాలయం కిటికీలు

క్రీడలపై ఆసక్తి పెంపొందించాలి


కరాటే పోటీలు ప్రారంభించి మాట్లాడుతున్న నల్లగొండ కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

- రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు ప్రారంభం

నల్లగొండ టౌన్ : తల్లిదండ్రులు తమ పిల్లలకు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంపొందించాలని నల్లగొండ కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ అన్నారు. మంగళవారం నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అండర్–14, 17 బాలబాలికల కరాటే పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. తాను ఇప్పటికీ ప్రతిరోజూ వాలీబాల్ ఆడతానని చెప్పారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో రాణించాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి బి.భిక్షపతి, ఫెడరేషన్ కార్యదర్శి జి.వాసుదేవరావు, కరాటే అసోసియేషన్ కార్యదర్శి నరసింహాచార్యులు, కె.నర్సిరెడ్డి, లావణ్య, వి.రవీందర్, విమల, నాగరాజు, ధర్మేందర్‌రెడ్డి, శంఖులింగం, వెంకట్, శ్రీకాంత్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బాలు, బ్రహ్మయ్య, దేవేందర్‌రెడ్డి, గఫార్, కవిత, శ్రీనివాసరావు, యాదయ్య, షరీఫ్ పాల్గొన్నారు.


కరాటే పోటీలో తలబడుతున్న క్రీడాకారులు

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మిర్యాలగూడ అర్బన్: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన రెమడాల వెంకటేష్(21) మిర్యాలగూడ పట్టణంలోని ఓ కారు సర్వీసింగ్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి సర్వీస్ సెంటర్‌లో గల విద్యుత్ తీగ తెగి నీళ్లలో పడింది. అది గమనించని వెంకటేష్ వాటర్‌లోకి వెళ్లడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతులకు నాణ్యమైన ఎరువులు అందాలి

- నల్లగొండ కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్
- యాసంగి సాగు ప్రణాళికపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ : యాసంగి సీజన్‌లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తూ రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో యాసంగి పంటల సాగు ప్రణాళిక, ధాన్యం కొనుగోళ్లపై వ్యవసాయ, పౌర సరఫరాల, గ్రామీణాభివృద్ధి, సహకార శాఖల అధికారులతో సమావేశమై సమీక్షించారు. యాసంగిలో జిల్లాలో 4,80,000 ఎకరాల్లో సాగు అంచనా వేసినట్లు వ్యవసాయ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటి వరకు లక్ష ఎకరాల్లో వరి నార్లు పోసుకున్నారని.. 4వేల ఎకరాల్లో నాట్లు వేశారని, మరో 4 వేల ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారని తెలిపారు. ఈ సీజన్‌లో 71 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా 24 వేల టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని 7 వేల మెట్రిక్ టన్నులు మండలాల్లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాసంగిలో పంటల సాగు ప్రణాళిక ప్రకారం రైతులకు ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ఇబ్బందులు కలగకుండా ఇప్పటివరకు కొనుగోలు కేంద్రాలకు చేరుకున్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని, కేంద్రాల్లో ధాన్యం తడవకుండ టార్పాలిన్లు కప్పాలని సూచించారు. ఇప్పటి వరకు 3,01,700 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.583 కోట్లు రైతులకు చెల్లించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రావణ్‌కుమార్, ఉద్యాన శాఖ అధికారి సంగీత లక్ష్మి, పౌర సరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల డీఎం నాగేశ్వర్‌రావు, డీసీఓ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాలల సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలో బహుమతి అందుకుంటున్న విద్యార్థి మహిదర్

చివ్వెంల : దురాజ్‌పల్లి గ్రామ శివారులోని ఎంఎస్‌ఆర్ సెంట్రల్ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి కె.మహిదర్ జాతీయ స్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీలకు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి ఎల్.దేవరాజ్ తెలిపారు. అండర్‌స్టాండింగ్ ఎకో సిస్టమ్ ఫర్ హెల్త్ అండ్ వెల్‌బీయింగ్ అనే అంశంపై మంగళవారం హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలో విద్యార్థి మహిదర్ ప్రతిభ కనబరిచారు. డొమెస్టిక్ వెస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ అనే ప్రాజెక్టు ఉత్తమమైందిగా ఎంపికకావడంతో నిర్వాహకులు అతడిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని జిల్లా విద్యాధికారి బి.అశోక్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న సలోని

ముల్కలపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని ప్రతిభ

తుర్కపల్లి : హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి పోటీల్లో తుర్కపల్లి మండలం ముల్కలపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని భూక్యా సలోని ఉత్తమ కనబరిచింది. గైడ్ టీచర్ పి.కళ్యాణి పర్యవేక్షణలో సలోని రూపొందించిన వాడిపడేసిన సిగరేట్ పీకతో కాలుష్యం పీక నొక్కుదాం..అనే ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మెంబర్ సెక్రటరీ శ్రీ మారుపాక నగేష్, విద్యాశాఖ మదన్‌మోహన్ చేతుల మీదుగా అవార్డుతో పాటు ప్రశంసాపత్రం అందుకున్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన సలోనిని కలెక్టర్ హనుమంత జెండగే, అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, డీఈఓ నారాయణ, సైన్స్ అధికారి భరణి కుమార్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.


సంతోష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

జాతీయ స్థాయిలో ఎంకేఆర్ విద్యార్థి ప్రతిభ

దేవరకొండ: దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. డిగ్రీ మూడవ సంవత్సరం చదువుతున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ కేతావత్ సంతోష్‌నాయక్ గత నెల 28న కర్ణాటక రాష్ట్రంలో జరిగిన జాతీయ ఇంటిగ్రేషన్ క్యాంప్–2023కు ఎంపిక కావడమే కాకుండా జాతీయ స్థాయిలో మూడు గుర్తింపు సర్టిఫికెట్లను అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రవి తెలిపారు. బుధవారం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సంతోష్‌ను అభినందించారు.

కాల్వలకు గండ్లు.. దెబ్బతిన్న తూములు

- అధ్వానంగా ఎస్సారెస్పీ కాలువలు
- నిర్వహణ లేక పెరుగుతున్న కంపచెట్లు
- మరమ్మతులు చేయించాలని రైతుల వినతి


నంద్యాలగూడెం స్టేజీ సమీపంలో కోతకు గురైన కాల్వ

అత్మకూర్–ఎస్(సూర్యాపేట) : నిర్వహణ లోపంతో ఎస్సారెస్పీ కాల్వలు ఆనవాళ్లు కోల్పోతున్నాయి. ఆత్మకూర్ –ఎస్ మండలంలో ఎస్సారెస్పీ కాలువ 69,71 డీబీఎంలతో పాటు వాటి ఉప కాలువల ద్వారా రెండు పంటలకు నీరు అందుతుంది. అయితే కాల్వల నిర్వహణకు ప్రత్యేక నిధులు లేవు.దీంతో పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా అక్కడక్కడా కంపచెట్లు తొలగిస్తున్నా పలుచోట్ల చెట్లు ఏపుగా పెరుగుతుండడంతో కాలువలు మూసుకుపోతున్నాయి. దీంతో నీరు వదిలిన సందర్భంలో కాలువలు కోతకు గురవుతున్నాయి. అదే విధంగా కాల్వలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆక్రమణకు గురవుతున్నాయి. అధికారులు చిత్తశుద్ధితో కాల్వల మరమ్మతులు చేయించడంతో పాటు భూములు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతులకు నోచని కాల్వలు

ఎస్సారెస్పీ కాలువ 69,71 డీబీఎంలతో పాటు వాటి ఉప కాలువల ద్వారా ఆత్మకూర్ –ఎస్ మండలంలోని గొలుసుకట్టు చెరువులకు నీరు చేరడంతో పాటు పలు గ్రామాల్లోని రైతులు వరి పొలాలకు నీరు వాడుతున్నారు. కాగా మండలంలోని ఎస్సారెస్పీ కాల్వలు ఎనిమిదేళ్లుగా మరమ్మతులకు నోచుకోక పోవడంతో పలు చోట్ల కంపచెట్లు పెరగడంతో నీరు సక్రమంగా పారడం లేదు. అనేక చోట్ల కాలువలకు గండ్లు పడడం, తూములు దెబ్బ తినడంతో నీరు సక్రమంగా పారడం లేదు.

కాల్వలకు మరమ్మతులు చేయించాలి



పొలాలకు నీరు పారాలంటే ఎస్సారెస్పీ కాల్వలను మరమ్మతులు చేయించాలి. ఎనిమిదేళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో పలు చోట్ల గండ్లు పడడం, కంప చెట్లు దట్టంగా పెరుగుతున్నాయి. మండలంలో ఎక్కువ శాతం మంది రైతులు ఎస్సారెస్పీ కాల్వ నీటిపై ఆధారపడి వరి సాగు చేస్తున్నారు.అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలి.

– మూల లింగయ్య, నసీంపేట

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

నకిరేకల్: ఉపాధ్యాయులు అంకితభావంతో విద్యాబోధన చేస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని డీఈఓ భిక్షపతి సూచించారు. నకిరేకల్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం అమలు తీరును తెలుసుకున్నారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌లో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంఈఓ నాగయ్య, స్థానిక హెచ్‌ఎం కె.రాములు పాల్గొన్నారు.

వీఎన్ స్ఫూర్తితో పోరాడుతాం

నల్లగొండ టౌన్ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మల్లు వెంకట నర్సింహారెడ్డి స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతామని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో మల్లు వెంకట నర్సింహారెడ్డి 19వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లాలో నెలకొన్న సమస్యల పరిష్కారం, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం నూతనంగా ఎన్నికైన శాసనసభ్యులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మల వీరారెడ్డి, నారి అయిలయ్య, పాలడుగు నాగార్జున, ప్రభావతి, సయ్యద్‌హాషం, పుచ్చకాయల నర్సిరెడ్డి, మల్లం మహేష్, దండెంపల్లి సత్తయ్య, నలపరాజు సైదులు, మట్టయ్య, గిరిబాబు, పుష్కలత పాల్గొన్నారు.

కంది సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- నడిగూడెం ఏఓ ఎం.రాజగోపాలరావు


ఎం.రాజగోపాల రావు, ఏఓ, నడిగూడెం మం.

నడిగూడెం : ప్రస్తుతం కంది పంట పూత, పిందె దశలో ఉన్నది. ఈ దశలో అధిక దిగుబడులకు రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.. నడిగూడెం మండల వ్యవసాయ అధికారి ఎం.రాజగోపాలరావు సూచిస్తున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఆశించే పురుగులు.. నివారణ చర్యలు

ఆకు చుట్టు పురుగు : కంది మొక్క పెరిగే దశలో ఆకు చుట్టు పరుగు ఆశిస్తుంది. అలాగే ఆకులను, పూతను చుట్టగా చుట్టుకొని లోపల ఉండి గీరి తింటుంది. దీని ఉధృతి ఎక్కువగా ఉంటే మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదా క్వినాల్‌ఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే పురుగులు నశిస్తాయి.

కాయ తొలుచు పురుగు

ఈ పురుగు పూత, పిందె దశలో కాయలకు రంధ్రాలు చేసి తింటూ, ఒక కాయ నుంచి మరో కాయకు ఆశిస్తుంది. ఈ పురుగు తక్కువగా ఆశించే జొన్న, సోయా చిక్కుడు, నువ్వులు, మినుము, ఉలవ, మెట్ట వరి మొదలైన పంటలతో పంట మార్పిడి చేయాలి.


నడిగూడెం మండలం బృందావనపురం వద్ద పూత, కాత దశలో ఉన్న కందిచేను

- ఖరీఫ్‌లో అంతర పంటగా 7 సాళ్ల, రబీలో 3 సాళ్ల పెసర, మినుము, వేయడం ద్వారా పరాన్న జీవులను వృద్ధి చేయడానికి తోడ్పడతాయి. పొలం చుట్టూ 4 సాళ్ల జొన్న రక్షిత పైరుగా విత్తాలి.
- పచ్చ పురుగును తట్టుకునే యల్.ఆర్.జి. 41రకాన్ని సాగు చేయాలి.
- పైరు విత్తిన 90–100 రోజుల్లో చిగుళ్లపై ఒక అడుగు మేరకు కత్తిరించాలి.
- ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చి పురుగు ఉనికిని గమనించి తగిన సస్య రక్షణ చర్యలు చేపట్టాలి.
- పురుగులను తినే పక్షులను ఆకర్షించడానికి వీలుగా ఎకరానికి 20 పక్షి స్థావరాలను ఏర్పాటు చేయాలి.
- పురుగు గుడ్లను, తొలి దశ పురుగులను గమనించి వెంటనే 5శాతం వేప గింజల కషాయాన్ని లేదా వేప సంబంధిత మందును 200లీటర్ల నీటిలో కలిపి వారం రోజుల తేడాతో రెండు సార్లు సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలి.
- బాగా ఎదిగిన పురుగులను ఏరివేయాలి. లేదా చెట్లను బాగా కుదిపి దుప్పట్లలో పడిన పరుగులను నాశనం చేయాలి.

రసాయన పురుగు మందులను విచక్షణా రహితంగా వాడరాదు

పైన చెప్పిన చర్యలు తగిన సమయంలో చేపట్టలేనప్పుడు తప్పనిసరి అయితే పురుగు ఉధృతిని బట్టి పైరు మొగ్గ లేదా తొలి పూత దశలో ఉన్నప్పుడు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ, పూత లేదా కాయ దశలో క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి హ్యాండ్ కంప్రెషర్ స్ప్రేయర్‌తో పిచికారీ చేయాలి.

మారూక మచ్చల పురుగు : దీని నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు, లేదా థయోడికార్బ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మందులను మార్చి వారం రోజులకు ఒకసారి పిచికారీ చేయాలి.

కాయ ఈగ

కాయ ఈగ ఆశించినప్పుడు నష్టం కనిపించదు. దీని వల్ల పురుగు కాయ లోపలే ఉండి గింజలను తినేస్తుంది. ఈ పురుగు అన్ని దశలనూ కాయ లోపలే పూర్తి చేసుకొని తల్లి పురుగు మాత్రమే బయటకు వస్తుంది. తల్లి పురుగు లేత పిందె దశలో కాయలపై గుడ్లు పెడుతుంది. కావున పిందె దశలో 5శాతం వేప గింజల కషాయం పిచికారీ చేసినట్లయితే గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. గింజ గట్టిపడే దశలో డైమిథోయేట్ 2.0 మి.లీ లేదా ప్రొఫెనోఫాస్ 2.0 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.